ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





రంజాన్ వేళలు
ఇఫ్తార్ - ఆదివారం
సాయంత్రం - 6.32
సహర్ - సోమవారం
ఉదయం - 5.00

ఎమ్మెల్సీ కవిత అరెస్టు సరికాదు

- న్యాయ వ్యవస్థలపై నమ్మకం ఉంది
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, మార్చి 16 : ఎమ్మెల్సీ కవితను విచారిస్తామంటూ వచ్చి ఎన్నికల నోటిఫికేషన్‌కు ఒకరోజు ముందు అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. కవిత అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీఎత్తున నిరసన ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సబితారెడ్డి పాల్గొని మాట్లాడుతూ వేల కోట్లు దోచుకొని దాచిపెట్టడంతో పాటు దేశం విడిచి పారిపోయిన వారిని వదిలేసి.. అనునిత్యం ప్రజల కోసం పని చేస్తున్న కవితను అరెస్టు చేయడం ఎంతవరకు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

సమంజసమని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కోలేక అడ్డదారుల్లో మోదీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకొని అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. న్యాయ వ్యవస్థలపై తమకు నమ్మకం ఉందని, ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని సబిత అన్నారు. లిక్కర్ కేసులో కవితకు ఎలాంటి సంబంధం లేకున్నా.. కేవలం రాజకీయ కోణంలో కేసు నమోదు చేశారన్నారు. నల్లధనం తీసుకొచ్చి ప్రతీ ఒక్కరి ఖాతాలో రూ.15లక్షలు జమ చేస్తామని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన మోదీ.. పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా.. కొత్తవి ఇవ్వకపోగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టారన్నారు. కవితవెంట తెలంగాణ ప్రజలు ఉన్నారని, ఆమె వెంటనే నిర్దోషిగా బయటకు వస్తారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అంతకుముందు కేంద్ర ప్రభుత్వం, ఈడీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజునాయక్, పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, సామ్యేల్‌రాజు, నవీన్, మనోహర్, సీతారామ్‌నాయక్, అశోక్, ఆదిల్, కె.ప్రభాకర్, జంగయ్య, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



మోగిన ఎన్నికల నగారా



- ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ
- చేవెళ్ల, మల్కాజిగిరిలో మే 13న పోలింగ్ జూన్ 4న కౌంటింగ్
- మల్కాజిగిరిలో అత్యధికంగా 37,28,519 మంది ఓటర్లు

లోక్‌సభ షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికలకు నగారా మోగింది. శనివారం కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలోని చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాలకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే రోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు కానుంది. ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో చేవెళ్ల, మల్కాజిగిరి, భువనగిరి పార్లమెంట్ స్థానాలు ఉన్న విషయం తెలిసిందే. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో తాండూరు, వికారాబాద్, పరిగి, చేవెళ్ల, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గాలు రానున్నాయి. అలాగే మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఉప్పల్, మేడ్చల్, ఎల్‌బీనగర్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇక ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాత్రం భువనగిరి పార్లమెంట్ పరిధిలోకి వెళ్లనుంది. షెడ్యూల్ ప్రకారం అన్ని నియోజకవర్గాల్లో మే 13నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. అలాగే నామినేషన్ల పరిశీలన 26న పూర్తికానుంది. నామినేషన్ల ఉపసంహరణకు 29వ తేదీ వరకు తుది గడువుగా నిర్ధారించారు. మే 13న పోలింగ్ నిర్వహించనుండగా జూన్ 4న కౌంటింగ్ జరగనుంది. ఇదిలా ఉంటే ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల ప్రవర్తనా నియామవళి శనివారం సాయంత్రం నుంచే అమల్లోకి వచ్చింది. ఎన్నికల నిర్వాహణ కోసం మూడు జిల్లాల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల పరిశీలకులను నియమించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సభలు, సమావేశాలు, ర్యాలీలపై ఆంక్షలు మొదలయ్యాయి. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, రాజకీయేతరులు ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించినా సంబంధిత అసెంబ్లీ సెగ్మెంట్ ఏఆర్వో నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, కటౌట్లు తక్షణమే తొలగించాలని అధికారులు ఆదేశించారు. ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు కొనసాగనుంది. ఇదిలా ఉంటే చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికలు రాజకీయ పార్టీలకు ఎంతో కీలకమనే చెప్పాలి. హైదరాబాద్ మహానగరంలో అంతర్భాగంగా ఉన్న ఈ నియోజకవర్గాల్లో ఎన్నికలు దేశ ప్రజల్లో కూడా ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి. మల్కాజిగిరి నియోజకవర్గం దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గం కావడం గమనార్హం. ఇక్కడ మొత్తం 37,28,519 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో 29,14,124 మంది ఓటర్లు ఉన్నారు.

చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఓటర్లు (అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా)

నియోజకవర్గం	ఓటర్లు
తాండూరు	2,43,849
వికారాబాద్	2,31,679
పరిగి	2,66,273
మహేశ్వరం	5,55,978
రాజేంద్రనగర్	5,99,585
శేరిలింగంపల్లి	7,47,673
చేవెళ్ల	2,69,087
మొత్తం	29,14,124

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఓటర్లు

నియోజకవర్గం	ఓటర్లు
కూకట్‌పల్లి	4,71,878
కుత్బుల్లాపూర్	7,12,759
మల్కాజిగిరి	4,99,536
ఉప్పల్	5,33,544
మేడ్చల్	6,58,190
ఎల్బీనగర్	6,00,552
కంటోన్మెంట్	2,52,060
మొత్తం	37,28,519

భువనగిరి పార్లమెంట్ పరిధి..

ఇబ్రహీంపట్నం	3,37,134

ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి : కలెక్టర్ శశాంక



మాట్లాడుతున్న కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక నోడల్ అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదల చేసిన అనంతరం శనివారం కలెక్టరేట్‌లో వివిధ విభాగాల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్, ప్రైవేట్ స్థలాల్లో పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, అడ్వర్టైజ్‌మెంట్స్, కటౌట్స్ తొలగించాలని ఆదేశించారు. 1950 ద్వారా, కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని, సీ-విజిల్ యాప్ ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఎంసీసీ టీంలు క్షేత్రస్థాయిలో నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, నోడల్ అధికారులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ శశిధర్‌రెడ్డి



జిల్లా ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో రాజీ పడుతున్న కక్షిదారులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : రాజీమార్గమే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ శశిధర్‌రెడ్డి అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో శనివారం లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 33 లోక్‌అదాలత్ బెంచీలను ఏర్పాటుచేశారు. ఇందులో రాజీకి ఆమోద యోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారువాహన ప్రమాద బీమా కేసులు, కంజ్యూమర్ కోర్టు కేసులు, ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించారు. అదేవిధంగా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా రూ.5,40,000 బాధితులకు అందించారు. కాగా, ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, బ్యాంకు రికవరీ, ప్రిలిటిగేషన్ ట్రాఫిక్ చలాన్ కేసులు అన్ని కలిపి సుమారు 15,00,000 కేసులు పరిష్కరించారు. అన్ని కేసుల్లో కలిపి మొత్తం రూ.6,25,00,753 వరకు నష్ట పరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్‌లో కక్షిదారులు, దరఖాస్తుదారులు, బ్యాంకు మేనేజర్లు, లోక్ అదాలత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

చౌదరిగూడ/కేశంపేట, మార్చి 16: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చౌదరిగూడ మండల కేంద్రలోని ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం డీవో అంజనేయులు తెలిపారు. ఈమేరకు పరీక్ష కేంద్రాల్లో శనివారం హాల్‌టికెట్ నంబర్లు వేశారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలు రేపు (సోమవారం) ప్రారంభమై ఈనెల 30న ముగుస్తాయని చెప్పారు. పరీక్షల నిర్వహణ కోసం 14 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్ విల్సన్‌సునీల్, ఉపాధ్యాయులు యాదయ్య, నాగేశ్వర్‌రావు, శంకర్‌గౌడ్ ఉన్నారు. అదేవిధంగా కేశంపేట మండల కేంద్రంలో మూడు సెంటర్లు ఏర్పాటు చేశారు. కాగా, విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, హాల్‌టికెట్లు వెంట తెచ్చుకోవాలని మండల ఇన్‌చార్జి ఎంఈవో మనోహర్ సూచించారు.



కడ్తాల్ : రథోత్సవంలో పెద్దఎత్తున పాల్గొన్న భక్తులు

ఘనంగా రథోత్సవం

- కొనసాగుతున్న వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్, మార్చి 16: మండల పరిధిలోని చరికొండ శ్రీ వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో అలంకరించారు. శనివారం తెల్లవారుజామున స్వామి వారి రథోత్సవం నిర్వహించారు. రథంపై ఉత్సవ విగ్రహాలు ఉంచి తాళ్లతో లాగి మొక్కులు చెల్లించుకున్నారు. చక్రవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకం, లంకాదహనం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్‌లు నర్సింహాగౌడ్, లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆమనగల్లు : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వెంకటగిరి వేంకటేశ్వర స్వామి 124వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక నేపథ్యంలో నిర్వాహకులు విశాల వసతులు ఏర్పాటు చేశారు. ఉదయం అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామికి సుప్రభాత సేవతో మేలుకొలుపు పాడారు. అనంతరం మూలవిరాట్లను పట్టువస్త్రాలతో అలంకరించి ప్రధాన అర్చకుడు గూడ కృష్ణమాచార్య ఆధ్వర్యంలో అర్చకులు విశ్వక్‌సేన ఆరాధన, పుణ్యాహవాచనం, అంకురార్పన, దేవతాహ్వానం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆద్యంతం.. ఆధ్యాత్మిక పర్వం

- కన్హా శాంతివనంలో కొనసాగుతున్న ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవం
- వివిధ మతపెద్దల హాజరు.. ఆధ్యాత్మిక సందేశాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నందిగామ/కేశంపేట, మార్చి 16: ప్రపంచాన్ని భక్తి మార్గం వైపు నడిపే ఉత్సవం.. ఆకట్టుకుంటున్న ఆధ్యాత్మిక మహోత్సవం.. ఇది శాంతిని నెలకొల్పే ఆయుధం.. భక్తిని నలుమూలలా వ్యాపింపజేసే ఔషధం. ప్రపంచంలో ఏ మార్పు రావాలన్నా ఆధ్యాత్మికతతోనే సాధ్యం. ఈ సారాన్ని ప్రపంచానికి తెలియజేసి ప్రతీ ఒక్కరిని భక్తిమార్గంలో నడపాలన్నది ఆధ్యాత్మిక మహోత్సవ ఉద్దేశ్యం. దీనికి అక్షరాల ప్రాణం పోస్తూ రామచంద్రమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విభిన్న మతాల ఐక్యత.. ఆధ్యాత్మికత ప్రశంసనీయమని శనివారం కన్హా శాంతివనంలో జరిగిన ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవంలో దేశ విదేశాల నుంచి విచ్చేసిన వివిధ మతాలకు చెందిన ఆధ్యాత్మిక గురువులు ముక్తకంఠంతో ప్రశంసించారు.

సాంకేతిక విజ్ఞానం.. కావాలి శాంతికి సోపానం

దేశానికి ప్రయోజనాన్ని చేకూర్చే సాంకేతికతను పరిచయం చేసి.. అభ్యున్నతికి పాటుపడిన పాశ్చాత్య శాస్త్రవేత్తలు ప్రపంచ శాంతికోసం కృషిచేయడంలో విఫలమయ్యారని, శాస్త్రవేత్తలు ఆధ్యాత్మిక వేత్తలుగా మారినప్పుడు మరిన్ని అదనపు ప్రయోజనాలు సమాజానికి చేకూరుతాయని మహాభోధి ఇంటర్‌నేషనల్ మెడిటేషన్ సెంటర్ గురూజీ బిక్కు సంఘసేన అన్నారు. ప్రపంచశాంతికి ఆధ్యాత్మికత తో పాటు సాంకేతికతను కూడా ఆయుధంగా ఉపయోగించవచ్చన్నారు. ప్ర స్తుతం 3జీ, 4జీ, 5జీ సేవలు ఉన్నాయని, మరో జీ అంటే గురూజీని విస్మరించడం బాధాకరమన్నారు. ఆధ్యాత్మిక మహోత్సవంలో భాగంగా 3వ రోజు జరిగిన అంతర్గత శాంతి, ప్రపంచశాంతి మార్గాలపై పలువురు ఆధ్యాత్మిక గురువులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆల్‌ఇండియా ఇమామ్ సంస్థ మతపెద్ద డాక్టర్ ఇమామ్ ఉమర్ అహ్మద్ ఇలియాసి మాట్లాడుతూ మన విశ్వాసాలు, ఆచారాలు, మత సంఘాలు భిన్నంగా ఉండవచ్చు కానీ, అన్నిటికన్నా మించినది ధర్మం, మానవత్వమని తెలిపారు. మానవులంతా ఐక్యంగా ఉంటే ఒకరినొకరు గౌరవించుకుంటామన్నారు. అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య గురువు అభిజిత్ హాల్దర్ మాట్లాడుతూ ధర్మబోధ మూడు బాగాలుగా విభజించబడిందని, నైతికత, బుద్ధి, ప్రజ్ఞ వీటిని పాటించిన వారు అత్యున్నత స్థాయిలో స్వీయ సాక్షాత్కార్యాన్ని పొందవచ్చని సూచించారు. ప్రకృతిని కాపాడటానికి మానవులు ఏదో ఒకటి చేస్తారంటూ బుద్ధుడు రెండువేల ఏళ్లక్రితమే చెప్పారని.. అది ఇప్పుడు హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ ద్వారా సాధ్యమైందని వివరించారు. సద్గురు రితేశ్వర్ మహరాజ్ మాట్లాడుతూ ప్రతీఒక్కరు ఆధ్యాత్మికంగా ఉంటే శాంతియుతంగా ఉండగలుగుతామని, అప్పుడే ప్రపంచం కూడా శాంతిగా ఉంటుందన్నారు. హైదరాబాద్ ఆర్చ్ బిషప్ కార్డినల్ అంథోనిపూలా మాట్లాడుతూ అంతర్గత శాంతి అనేది వ్యక్తులపై ప్రేమ, కరుణ చూపుతుందన్నారు. ప్రపంచశాంతికి, శాంతి సమగ్రతకు తమ వంతు పాత్ర పోషిస్తామని తెలిపారు. శిరోమణి గురుద్వార ప్రభంద కమిటీ మెంబర్ డీఎస్ ఆనంద్ మాట్లాడుతూ ఆసుపత్రికి వెళితే ఆరోగ్యం విలువ, అనాథాశ్రమానికి వెళితే కుటుంబ విలువ ఎలా తెలుస్తుందో.. గురూజీలను ఆశ్రయిస్తే ఆధ్యాత్మిక తెలుస్తుందన్నారు. ఆధ్యాత్మికతతో కూడిన సంగీత విభావరి, కళాకారుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తున్న వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయకులు



తామర పూలను ఆసక్తిగా తిలకిస్తున్న సందర్శకులు



వేదికపై కమలేష్ డీ పటేల్‌తో ఆధ్యాత్మిక గురువులు



ఆధ్యాత్మిక మహోత్సవంలో అభ్యాసికులు, తదితరులు

కులగణనకు ఉత్తర్వుల జారీ హర్షనీయం

బషీరాబాద్, మార్చి16: ఇంటింటి సమగ్ర కులగణనకు ప్రభుత్వం అమోదం తెలుపుతూ జీవో నంబరు 26కి ఉత్వర్వులు జారీ చేయడం హర్షనీయమని బషీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కలాల్ నర్సింహులుగౌడ్ శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. కులగణనతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాల్లో విద్య, ఉపాధి, సామాజిక, ఆర్థిక, రాజకీయ అవకాశాలు పెరిగేందుకు వీలుంటుందన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

వికారాబాద్, మార్చి 16: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఎన్నికల నిబంధనలను పాటించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడా ఫ్లెక్సీలు, పోస్టర్లు, వాల్ రైటింగ్‌లు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎక్కడా ప్రారంభోత్సవాలు , సమావేశాలకు అనుమతి లేదన్నారు. ఇంజనీరింగ్‌కు సంబంధించిన పనులు కొనసాగించవచ్చని తెలిపారు. ఎన్నికల్లో అక్రమాల నివారణకు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్‌లు పనిచేయాలన్నారు. వారి వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేస్తామన్నారు. గ్రీవెన్స్ సెల్ ప్రతీ ఏఆర్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేయాలన్నారు. మీడియా మానిటరింగ్ సెంటర్ ఏర్పాటు, ఎంసీఎంసీ టీమ్‌లన్నీ నేటి(ఆదివారం) నుంచే పనిచేయాలని, పోలీస్‌శాఖతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంటు ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్లు ఓటరు జాబితాలో ఫామ్ 6, 7, 8 పెండింగ్ ఉన్న వాటిని పూర్తి చేయాలన్నారు. ఫామ్ 12డీ సిద్ధంగా ఉంచాలన్నారు.

ధారూరు మార్కెట్లో వ్యవసాయ ఉత్పత్తులకు బీట్లు

ధారూరు, మార్చి 16: ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం కంది, వేరుశనగ, మొక్కజొన్న వ్యవసాయ ఉత్పత్తులకు బీట్లు నిర్వహించారు. కంది క్వింటాలుకు గరిష్టంగా రూ.10,300, కనిష్టంగా రూ. 10,050, వేరుశనగ క్వింటాలుకు గరిష్టంగా రూ.6,850, కనిష్టంగా రూ. 6600లు, మొక్కజొన్న క్వింటాలుకు గరిష్టంగా రూ.2,250, కనిష్టంగా రూ.2,200 ధరలకు విక్రయాలు జరిగాయని మార్కెట్ సహాయ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు.

రాజీమార్గమే రాజమార్గం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి సుదర్శన్

వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయాధికారి సుదర్శన్

వికారాబాద్/పరిగి, మార్చి 16 : లోక్ అదాలత్‌లో రాజీపడితే ఇరువర్గాలు విజయం సాధించినట్లేనని జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.సుదర్శన్ అన్నారు. వికారాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా వికారాబాద్ కోర్టులో మొత్తం 623 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరువర్గాలు విశాల దృక్పథంతో ఆలోచిస్తే లోక్‌అదాలత్‌తో కేసు నుంచి విముక్తి కలగవచ్చన్నారు. రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, అదనపు న్యాయమూర్తి శృతిదూత, ఏఎస్పీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సీఎం రాజ్యలక్ష్మి

కేసులు సత్వరమే పరిష్కారం

కేసుల్లోని ఇరుపక్షాలు రాజీపడితే కేసులను సత్వరమే పరిష్కారం అవుతాయని పరిగి మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి నాగుల శిల్ప అన్నారు. ఈ సందర్భంగా మొత్తం 431 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో ఏపీపీవో దీపారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజీపడితే ఇరుపక్షాలూ గెలిచినట్టే

షాద్‌నగర్‌అర్బన్/చేవెళ్ల/ఇబ్రహీంపట్నం/మాడ్గుల : సమస్యల పరిష్కారం కోసం సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్‌లో రాజీ పడితే ఇరువర్గాలు గెలిచినట్టే అవుతుందని షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి సీఎం రాజ్యలక్ష్మి అన్నారు. షాద్‌నగర్ కోర్టు సముదాయంలోని మూడు కోర్టుల్లో శనివారం మెగా లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కేసుల్లో ఇరువర్గాలు రాజీపడడంతో 186 క్రిమినల్, ఒక సివిల్, 383 డ్రంకెన్‌డ్రైవ్, 2730పీటీ, ఒక బ్యాంక్, రెండు భూవివాద కేసులను పరిష్కరించారు. వివిధ కేసుల్లో రూ.15,26,500 జరిమానాలను వసూలు చేసినట్టు కోర్టు వర్గాలు తెలిపారు. ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 2181 కేసులను పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు వెల్లడించాయి. పోలీస్‌స్టేషన్ల వారీగా ఆదిభట్ల 623, ఇబ్రహీంపట్నం 493, యాచారం 457, మంచాల 436, హైదరాబాద్ గ్రీన్ ఫార్మా పరిధిలో 172 కేసులు పరిష్కరించారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో మొత్తం 2843 కేసులు పరిష్కారం కాగా, రూ.15,87,260 డబ్బులు జరిమానాలు విధించారు. మాడ్గుల పీఎస్‌కు సంబంధించి ఆమనగల్లు కోర్టులో కక్షిదారులు రాజీపడినట్లు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. 22 క్రిమినల్, 244 పిటీ కేసుల్లో రాజీపడినట్లు చెప్పారు. ఆమనగల్లులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అధ్యక్షతన నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల, తలకొండపల్లి మండలాలకు సంబంధించి 1609 కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన ఉండాలి

● వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, మార్చి 16: నియోజకవర్గంలో పార్లమెంటరీ ఎన్నికల విధుల నిర్వహణకు నియమించబడిన అధికారులు వారికి సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం వికారాబాద్ నియోజకవర్గంలో ఎన్నికలు నిర్వహించే అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికారాబాద్ నియోజకవర్గంలో 12శాతం పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టార్ చొప్పున 25మంది సెక్టోరల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 1400మంది, పట్టణ ప్రాంతాల్లో 1500 మంది ఓటర్లను మించి ఉండకుండా జాగ్రత్తలు చెప్పినట్లు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఎస్ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ, అకౌంట్స్ టీమ్‌లతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, నియోజకవర్గ నోడల్ అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

పదేళ్లు ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డే..

● మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

కొత్తూర్, మార్చి 16: రాబోయే పదేళ్లు ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డే కొనసాగుతారని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి అన్నారు. ఇటీవల బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన జితేందర్‌రెడ్డిని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం తిమ్మాపూర్ వద్ద శనివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ముందుకు సాగుతానని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ విశాలాశ్రవణ్, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, ఏపీ మిథున్‌రెడ్డి, జిల్లెలరాంరెడ్డి, హరినాథ్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, శ్రీనివాస్, తుపాకుల శేఖర్, అశోక్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ


సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

చేవెళ్ల, మార్చి 16 :ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సాధించుకోవడం ద్వారానే మాదిగలకు న్యాయం జరుగుతుందని, వారి జీవితాల్లో చీకటి తొలగి, వెలుగు వస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. చేవెళ్లలో మాదిగ ఉపకులాల పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ లేకపోవడం వల్లే విద్యా, ఉద్యోగాల్లో మాదిగలకు రావాల్సిన అవకాశాలు దక్కకుండా పోతున్నాయని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్లలో విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు నరసింహ, ప్రవీణ్‌కుమార్, శంకర్‌రావు, మల్లికార్జున్, ప్రశాంత్, ఆనంద్, భాను, తదితరులు ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం : కొండా


మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, మార్చి 16 : లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ కంజర్ల మాల్‌లో నిర్వహించిన చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ స్థాయి సీనియర్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు అభ్యర్థులే దొరకడం లేదని ఎద్దేవా చేశారు. తన గెలుపు కోసం యువత, ఏబీవీపీ కార్యకర్తల సహకారం అవసరమన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, చేవెళ్ల కన్వీనర్ మల్లారెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, కొలన్ శంకర్‌రెడ్డి, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, డాక్టర్ ప్రేమ్ రాజ్, బుచ్చిరెడ్డి, సుచరితరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

అర్హతతో పాటు నైపుణ్యం ఉంటేనే ఉద్యోగం



కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కంపెనీల ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం, మార్చి16: బీటెక్ చేసినంత మాత్రాన ఉద్యోగ కల్పన సాధ్యం కాదని నైపుణ్యం ఉంటేనే ఏదైనా కంపెనీలో ఉద్యోగం పొందవచ్చని వివిధ కంపెనీల ప్రతినిధులు విద్యార్థులకు సూచించారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యా సంస్థల్లో శనివారం హెచ్‌ఆర్ కాంక్లేవ్ -2024 పేరుతో జాతీయ సదస్సు జరిగింది. హెడ్ టాక్స్ హెక్సగోన్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, సీహెచ్‌ఆర్‌వో కేయోలిస్ సహా 20 బహుళ జాతి కంపెనీలకు చెందిన ప్రతినిధులు మాట్లాడారు. ఏదైనా కంపెనీని ఎంచుకునేటప్పుడు పూర్వాపరాలు, ఉద్దేశ్యాలు తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారితో మాట్లాడి సలహాలు తీసుకున్నారు. గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ జీఎస్ కోహ్లీ, ఎండీ డా.హెచ్.ఎస్.సైనీ, డైరెక్టర్ డా.కె.వెంకట్రావు, ప్రిన్సిపాల్ డా.ఎస్.శ్రీనాథరెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ డా.రిషి సాయల్, జాయింట్ డైరెక్టర్ డా.పార్థసారధి, డా.ఎస్.రంగనాయకులు, కార్పొరేట్ రిలేషన్స్ వినయ్ చోప్రా, తదితరులుపాల్గొన్నారు.

ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లించాలి

చౌదరిగూడ, మార్చి 16 : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. శనివారం లాల్‌పహాడ్‌లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలో పని చేస్తున్న కూలీలకు మంచినీటి వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాబ్ కార్డు లేని వారికి కార్డులు అందించి పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంజనేయులు, వెంకటేష్, గోపాల్, శ్రీను, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎన్నిక ఏదైనా కాంగ్రెస్‌దే విజయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, మార్చి 16 : రాష్ట్రంలో ఎన్నిక ఏదైన కాంగ్రెస్‌దే విజయమని, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో అదే జరుగబోతుందని అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పార్టీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, జడ్పీటీసీలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. జీవన్ రెడ్డి విజయాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని వారికి సూచించారు.సమావేశంలో ఎంపీపీ కమ్లీమోత్యనాయక్, జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రాములు, పాలకుర్ల ఉ మావతి, నిర్మలాదేవి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, మార్చి 16 : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. శంకర్‌పల్లి మండల పరిధిలోని పొద్దటూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, కమ్మెట గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు శనివారం ఆయన నివాసంలో కాంగ్రెస్‌లో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 14 ఎంపీసీట్లు కాంగ్రెస్ గెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఉదయ్‌మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ప్రభాకర్, ఎజాస్, బుచ్చయ్య, ఆనంద్, తిరుపతి, క్రాంతి, ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయుడి పల్లకీ సేవ


పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 16 : షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో శనివారం ఆంజనేయస్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. పూజారులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భజన చేస్తూ భక్తులు స్వామిని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో పులిమామిడి శ్రీశైలంగౌడ్, జి. వసంతరావు, ఎల్. రఘుగౌడ్, రఘునందన్‌రెడ్డిఇ, జి. రమేష్‌ముదిరాజ్, నర్సింహులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టెట్, డీఎస్సీపై ఉచిత అవగాహన సదస్సు

వికారాబాద్, మార్చి 16: గత టెట్, డీఎస్సీల్లో జిల్లా మొదటి, మూడో, నాల్గో ర్యాంకులు సాధించిన వికారాబాద్‌లోని ఏకేఆర్ స్టడీసర్కిల్‌లో ఈనెల 18, 19, 20వ తేదీల్లో ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ టీవీ రమణ తెలిపారు. మే 20 నుంచి టెట్ పరీక్షలు, జూలై 17 నుంచి డీఎస్సీ పరీక్షలు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని తెలుగు రాష్ట్రాల్లోని అగ్రశ్రేణి అధ్యాపక బృందంతో వికారాబాద్‌లోని నిరుద్యోగ బీఎడ్, డీఎడ్ విద్యార్థుల కోసం శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు తెలుగు రాష్ట్రాల్లోని అధ్యాపక బృందం పాల్గొననుంది. డీఎడ్ సెకండియర్, బీఎడ్ సెకండియర్ ప్రైవేట్ సంస్థల్లో పని చేసే అభ్యర్థుల కోసం ఈవినింగ్ బ్యాచ్ కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వివరాలకు 9441022571 నెంబరును సంప్రదించాలని సూచించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

తలకొండపల్లి, మార్చి16: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని అంగన్వాడీ టీచర్లు అనసూయ, సువర్ణ అన్నారు. మండల పరిధిలోని చంద్రధన గ్రామంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు చిరుధాన్యాలు తీసుకోవడంతో కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో కిశోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

మంచాల, మార్చి 16 : ప్రతీ పౌరుడు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని మంచాల సీఐ బబ్యానాయక్ సూచించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలతో శనివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బబ్యానాయక్ మాట్లాడుతూ ఓటర్లకు ఆత్మస్థైర్యం నింపేందుకు గ్రామాల్లో కవాతు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై రవి నాయక్, సతీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆరుట్లలో పోలీసుల కవాతు


కమిషనర్ నాగిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

తాగునీటి సమస్య పరిష్కరించండి

మేడ్చల్ టౌన్, మార్చి 16: మేడ్చల్‌లోని బ్రాడ్ వే కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మేడ్చల్ పట్టణ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్ కాలనీ వాసులతో కలిసి మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి శనివారం వినతి పత్రం సమర్పించారు. కాలనీలో ఇప్పటి వరకూ మిషన్ భగీరథ పైప్‌లైన్ వేయక పోవటంతో బోరు బోవులపై ఆధారపడి తమ అవసరాలు తీర్చుకుంటున్నారని నేతలు తెలిపారు. మంచి నీటి పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసి కుళాయిల ద్వారానీటి సరఫరా చేయాలని కమిషనర్‌తో కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ తమ సిబ్బంది కాలనీని సందర్శించి తగు చర్యలు తీసుకుని నీటి సమస్యను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.

పాండురంగ ఆలయంలో పుష్పార్చన

తాండూరు, మార్చి 16: తాండూరులోని 24వ వార్డులో గల పాండురంగ దేవాలయ వార్షికోత్సవ అన్ని పురస్కరించుకుని శనివారం ఆలయధర్మకర్త మేడిశెట్టి జగన్నాథంచంద్రకళ ఆధ్వర్యంలో లక్షపూల అర్చన హోమం, పాండురంగ కల్యాణం, పల్లకీసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో పాటు వార్డుకౌన్సిలర్ సాహుశ్రీలత, మున్సిపల్ చైర్మన్ స్వప్న పరిమళ, మాజీ మున్సిపల్ చైర్మన్లు కోట్రిక విజయలక్ష్మి, సునీతసంపత్, కౌన్సిలర్ ప్రభాకర్, నీరజాబాల్ రెడ్డి, శోభారాణి పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న మహిళలు

ఆడ పిల్లలకు సరైన విద్యనందించాలి



సన్మానిస్తున్న అధికారులు

రంగారెడ్డి అర్బన్/శంషాబాద్, మార్చి 16 : మగ పిల్లలతో సమానంగా ఆడ పిల్లలను చదివించాలని కలెక్టర్ శశాంక అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను కలెక్టరేట్‌లో నిర్వహించారు. వివిధ శాఖల్లో అత్యున్నత ప్రతిభ చాటిన మహిళా ఉద్యోగులను, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, విద్య, క్రీడా రంగంలో సత్తా చాటిన బాలికలను గుర్తించి 105 మందికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో పాటు రూ.2వేలు అందించారు. మహిళలతో పాటు ముగ్గురు ట్రాన్స్‌జెండర్లను, విద్యారంగంలో రాణించి ఎంఎన్‌సీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఆర్థియాదవ్, శ్రియ, గాయత్రిలను సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరి సక్సెస్‌లో మహిళ ఉంటుందని, తన విజయం వెనుక మా తల్లి ఉందని తెలిపారు. తాను తప్పులు చేసినా, తన తల్లి సరిచేసి సరైన దారిలో పెట్టిందని గుర్తు చేశారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలబడాలని, సొంత ఆలోచనలు, సంపాదన మీద స్వతంత్రత కలిగి ఉండాలని తెలిపారు. ఆడ పిల్లల విషయంలో తల్లులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా సంక్షేమాధికారి పద్మజా రమణ, అధికారులు పాల్గొన్నారు.

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డిని నిర్వాహకులు సన్మానించారు. కొన్నేళ్లుగా సిరి అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి శంషాబాద్‌లో మహిళలకు ఆమె అందించిన పలు సేవాకార్యక్రమాలను గుర్తించి మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమెను సన్మానించినట్లు వారు చెప్పారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్/ఆమనగల్, మార్చి 16 : డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని సీఎం అన్నట్లు వారు చెప్పారు.

రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఆసిఫ్ అలి, రాష్ట్ర నాయకుడు లింగంపల్లి ఆనంద్ శనివారం రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు.

సన్మార్గంతోనే దైవానుగ్రహం



ఎంపీకి ఆహ్వానపత్రిక అందజేస్తున్న అర్చకుడు

తలకొండపల్లి, మార్చి 16 : సన్మార్గంతోనే దైవానుగ్రహం పొందవచ్చని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. దైవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని ఆయన కోరారు. తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామ సమీపంలోని కల్కిదోన గుట్టపై గల శ్రీ వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను శనివారం ఆలయ అర్చకులు కృష్ణమూర్తి ఎంపీ రాములుకు అందజేశారు. ఈనెల 18న నిర్వహించే కల్యాణోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, నాయకులు గూడూరు గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిదంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి కృష్ణమూర్తి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.

పనితీరును బట్టే ప్రజల్లో గుర్తింపు



విజయలక్ష్మిని సన్మానిస్తున్న గోపాల్

కడ్తాల్ , మార్చి 16: పనితీరును బట్టే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని ఎంపీటీసీల సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహించి పనిచేసే చోట ప్రజల అభిమానం చూరగొనాలని ఆయన చెప్పారు. కడ్తాల మండలం రావిచేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి పదవి విరమణ చేస్తున్న ఉపాధ్యాయురాలు విజయలక్ష్మీకి శనివారం వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విజలక్ష్మీ దంపతులను ఆయన సత్కరించారు. ఆమె అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భారతమ్మ విఠలయ్యగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, విద్యాకమిటీ చైర్మన్ అలీ, ప్రధానోపాధ్యాడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, శంషాబాద్ మండల కార్యదర్శి నర్రా గిరి ప్రెస్ అకాడమి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని శనివారం కలిసి సన్మానించారు.

● శంషాబాద్, మార్చి 16

కుట్రపూరితంగానే ఎమ్మెల్సీ కవిత అరెస్టు

● బీఆర్ఎస్ ఆందోళనలు

● కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం



చేవెళ్ల : నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, మార్చి 16 : లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే కుట్రపూరితంగా ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్టు చేశారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆమె అరెస్టును నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలోని హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే యాదయ్య నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈడీని అడ్డుపెట్టుకుని కేంద్రప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని ఆరోపించారు. నాయకులు దేశమోళ్ల ఆంజనేయులు, కృష్ణారెడ్డి, అనంత్‌రెడ్డి, శివప్రసాద్, నర్సింలు, చందు, నరేందర్‌గౌడ్, చంద్ర శేఖర్, రామాగౌడ్, బుర్ల సాయినాథ్, శేరి రాజు, గిరిధర్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్ట్ చేయడంతో పట్టణంలో శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు, మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ కూడలిలో ధర్నా నిర్వహించారు. అనంతరం శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారిపై బైటాయించి రాస్తారోకో చేసి, కేంద్రప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ అనురాధపత్యానాయక్, దశరథ్‌నాయక్, ఉప్పల వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్,



ఆమనగల్లు : కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ సుప్రీం కోర్టులో కేసు విచారణ జరుగుతుండగా కవితను ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. ఆమెను వెంటనే విడుదల చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు పోనుగోటి అర్జున్‌రావు, నేనావత్ పత్యనాయక్, జోగు వీరయ్య, దోనాదుల కుమార్, బాలస్వామి, ఖలీల్, వెంకటేశ్, రమేశ్‌నాయక్, పాల్గొన్నారు.

కడ్తాల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామిక విలువలను కాలరాస్తూ నియంత పాలన సాగిస్తోందని జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, ఉప్పల వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ , వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ మండల కేంద్రంలో శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి అంబేద్కర్ విగ్రహం వద్ద బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, బొప్పిడి గోపాల్, ప్రియ, రమేశ్, మంజుల చంద్రమౌళి, పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : రాజకీయ కక్షతోనే మోదీ ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్టు చేయించిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆమె అరెస్టును నిరసిస్తూ శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో నిరసన ర్యాలీ నిర్వహించి సాగర్ రహదారిపై రాస్తారోకో చేసి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం దర్యాప్తు సంస్థలచే ప్రతిపక్షాలపై దాడులు చేయిస్తూ ఇబ్బందులపాలు చేస్తోందని విమర్శలు చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం, మంచాల ఎంపీపీలు కృపేష్, నర్మద, యాచారం జడ్పీటీసీ జంగమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు, చీరాల రమేష్, నాయకులు యాదగిరి, వేణుగోపాల్‌రావు, ఉన్నారు.

షాద్‌నగర్‌రూరల్ : దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని కేంద్రప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెడుతోందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. షాద్‌నగర్ కూడలిలో నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఆమెను రాత్రి పూట అరెస్ట్ చేయడం విచారకరమని అన్నారు. జడ్పీ వైస్‌చైర్మన్ ఈటె గణేష్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్‌చైర్మన్ నటరాజ్, కేశంపేట ఎంపీపీ రవీందర్, పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నాయని బీఆర్ఎస్ మండల నాయకులు విమర్శించారు. ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్టుకు నిరసనగా శనివారం మండలంలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. నాయకులు సదువు రాంచందర్ ముదిరాజ్, జయవంత్, గణేష్ రెడ్డి, సుదాకర్ యాదవ్, ఎన్కేపల్లి మంగళి శ్రీనివాస్, కావాలి సుభాష్, కుమ్మరి రాము, పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు

వైభవంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కేశంపేట, మార్చి 16 : మండల పరిధి బైర్కాన్‌పల్లి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. ఉత్సవ మూర్తులను పల్లకిలో మేళ, తాళాల మధ్య ఊరేగింపుగా ఆలయ మండపానికి తీసుకవచ్చారు. అర్చకులు నరసింహాశర్మ, రాజేంద్ర ప్రసాద్ కల్యాణాన్ని నిర్వహించారు. హైదరాబాద్, శంషాబాద్, మహేశ్వరం, షాద్‌నగర్ నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అంతకు ముందు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీ సురేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రూప్లానాయక్, రాఘవేందర్ రావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడవీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, వై. శ్రీనివాస్ యాదవ్, వై. గిరిధర్ యాదవ్, కొట్టం శశివర్ధన్ రెడ్డి, యాదగిరి చారి, అంజయ్య, కుమార్ యాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల అభివృద్ధి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌రూరల్, మార్చి 16 : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కుర్వ మల్లేష్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. ఇందిరమ్మ పాలనలో అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి విజయం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, శ్రీనివాస్, కృష్ణయ్య, అమీర్, కుమార్, అశోక్, ఉన్నారు.


మోదీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు



సభకు తరలుతున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, మార్చి 16 : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప సభకు ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ప్రధాని రాక నేపథ్యంలో ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో ఆయా మండలాల నుంచి జనసమీకరణ చేశారు. ఉదయం గ్రామాల నుంచి మండల కేంద్రానికి చేరుకున్న బీజేపీ శ్రేణులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో సభకు బయలు దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించి మూడో సారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా నాయకులు కండె హరిప్రసాద్, గోరటి నర్సింహ్మ, వీరయ్య, రాంపాల్‌నాయక్, దుర్గయ్య, శ్రీకాంత్ సింగ్, లక్ష్మణ్‌రావు, మన్యనాయక్, రవిగౌడ్, చెన్నకేశవులు, విక్రమ్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, రాములు, కండెసాయి, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



ప్యాడ్లతో పదోతరగతి విద్యార్థులు

యాచారం, మార్చి 16 : విద్యార్థులు ఇష్టంతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు విప్లవ్‌కుమార్ అన్నారు. శనివారం యాచారం మండలంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆందోళన చెందొద్దని చెప్పారు. వారి పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులున్నారు.

కందుకూరు : ఈనెల 18 నుంచి జరుగనున్న పదవతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఐనవోలు శ్రీకాంత్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. శనివారం మండలంలోని కస్తూర్బా బదిరుల ఉన్నత పాఠశాల, బీసీ, ఎస్సీ గురుకుల పాఠశాలల్లో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకుడు టి.వినోద్‌చారితో కలిసి 250మంది విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష సమయంలో విద్యార్థుల ఎలాంటి బయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగభూషణచారి, కె.వసుందర, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు, మార్చి 16 : ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 18న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబోతున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌వో ఎం.ఏ పాష తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న వారికి ఉచితంగా ఐఓఎల్ ఆపేషర్లు చేయిస్తామని చెప్పారు.

మాడ్గుల, మార్చి 16 : మండలంలోని నల్లచెర్వు గ్రామానికి చెందిన కట్ట సతీష్ అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై హైదరబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శనివారం ఆస్పత్రికి వెళ్ళి పరామర్శించారు. రూ.ఐదువేలు ఆర్థిక సహాయం చేశారు. వడ్డేపల్లి నవీన్‌గౌడ్, కట్టరాములు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్



జ్ఞానేశ్వర్

మొయినాబాద్ రూరల్, మార్చి 16 : భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడిగా బంటుజ్ఞానేశ్వర్ నియమితులయ్యారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడకు చెందిన బంటుజ్ఞానేశ్వర్ కొన్ని సంవత్సరాలుగా పార్టీలో క్రియశీలకంగా పనిచేస్తున్నారు. ఆయన చేసిన సేవాలను గుర్తించిన బీజేపీ అదిష్టానం రంగారెడ్డి జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చ అధ్యక్షునిగా నియమించింది. ఈ మేరకు బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తనకు నియామక పత్రాన్ని అందజేసినట్లు బంటుజ్ఞానేశ్వర్ తెలిపారు. తనపై పార్టీ నమ్మకంతో బాధ్యతలు ఇచ్చినందుకు పార్టీ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా యాదీష్



యాదీష్

మహేశ్వరం, మార్చి 16 : బీజేవైఎం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా మహేశ్వరం మండలం డబిల్‌గూడ గ్రామానికి చెందిన తెల్లమల్ల యాదీష్ రెండోసారి నియమితులయ్యారు. ప్రజాసమస్యలపై పోరాటాలు చేస్తూ ప్రజల మన్ననలు పొందిన యాదీష్ సేవలను గుర్తించిన పార్టీ మరోసారి బీజేవైఎం రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా యాదీష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో భాధ్యతలు అప్పగించినందుకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్కనర్సింహారెడ్డితో పాటు పార్టీ నాయకులకు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం



పనులను ప్రారంభిస్తున్న సురేందర్‌రెడ్డి

షాబాద్, మార్చి 16 : కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని, ప్రజలకు అనుగుణంగా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కేశవగూడ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, చెన్నయ్య, నర్సింహులు, సత్తయ్య పాల్గొన్నారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 16 : షాద్‌నగర్ బార్ అసోసియేషన్ ఎన్నికలను ఈనెల 28న నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి సీనియర్ న్యాయవాది మర్రి శంకరయ్య ఓ ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్ కోర్టు సముదాయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. బార్ అసోసియేషన్ పదవులకు పోటీ చేసే న్యాయవాదులు ఈనెల 18 నుంచి 20 వరకు నామినేషన్లను దాఖలు చేయాలని తెలిపారు. 21న నామినేషన్లను పరిశీలించి, 22న తుది జాబితాను విడుదల చేస్తామన్నారు. 28న పోలింగ్ ముగిసిన తరువాత ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలను విడుదల చేస్తామని శంకరయ్య తెలిపారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కేశంపేట, మార్చి 16 : మండల పరిధిలోని నిర్ధవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల వారికోత్సవం ఘనంగా జరిగింది. అలాగే 10వ తరగతి విద్యార్థులకు విడుకోలు పలికారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్ర శేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు గోపాల్ నాయక్, చంద్రశేఖర్, కరుణాకర్ గౌడ్, శ్రీలత, నాగరాజు, భాస్కర్ గౌడ్, కృష్ణయ్య, బడక మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

క్రైం కార్నర్

దొంగతనం కేసులో నిందితుడి రిమాండ్

మంచాల, మార్చి 16 : మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఓ దొంగతనం కేసును పోలీసులు 48 గంటల్లోనే చేదించి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధి లింగంపల్లి గ్రామంలో కసరమోని మల్లేష్, కుటుంబసభ్యులు ఈ నెల 11న ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. పెద్దఅంబర్‌పేట్ బతుకమ్మ కుంట కాలనీకి చెందిన అల్లం శివ(26) అనే వ్యక్తి తాళం వేసి ఉన్న మల్లేష్ ఇంట్లోకి చొరబడి 28 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగిలించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మంచాల పోలీసులు వేలిముద్రలు, సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రవికుమార్ తెలిపాడు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతుడు

మహేశ్వరం, మార్చి 16 : చికిత్స పొందుతూ గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మహేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రవిందర్ తెలిపిన వివరాల ప్రకారం పదిహేను రోజుల క్రితం శ్రీశైలం - హైదరాబాదు ప్రధాన రహదారి రాచులూరు గేటు వద్ద మతిస్థిమితం లేకుండా పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని మహేశ్వరం పోలీసులు వైద్య సేవల కోసం ఉస్మానియా ఆసుపత్రిలో చేర్చారు. పదిహేను రోజులుగా వైద్యం పొందుతున్న ఆ వ్యక్తి శనివారం మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు ధ్రువీకరించారు. మృతుని కుటుంబసభ్యులు ఎవరైనా ఉంటే 8712579987 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని, మృతదేహం ఉస్మానియా మార్చురీలో ఉందని ఎస్సై తెలిపారు.

ఆంజనేయ స్వామి విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన విగ్రహం

కందుకూరు, మార్చి 16 : మండల పరిధి చిప్పలపల్లి గ్రామంలోని ప్రకృతి ఆశ్రమం సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. శనివారం ఉదయం గ్రామస్థులు కందుకూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ మక్బుల్‌జాని చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



నర్సరీని సందర్శిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, మార్చి 16 : ఎండలు ముదురుతున్నందున తాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన యాచారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాలను, హరితహారం నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగు నీటి కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా నీటి సరఫరా జరిగేట్లు చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్‌భగీరథ అధికారులను ఆదేశించారు. హరితహారం నర్సరీలో మొక్కలను కాపాడాలన్నారు. పౌష్టికాహారం తీసుకుంటేనే బాలింతలు, గర్భిణీలు ఆరోగ్యంగా ఉంటారని వారికి సూచించారు. ఆయన వెంట ఉపాధిహామీ పథకం ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా జ్ఞాన సరస్వతి పూజలు



జ్ఞాన సరస్వతి చిత్రపటానికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు

కందుకూరు, మార్చి 16 : మండల పరిధి ఆకులమైలారంలోని ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి ఆధ్వర్యంలో శనివారం జ్ఞాన సరస్వతికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈ నెల 18 నుంచి పరీక్షలకు హాజరుకాబోయే పదవతరగతి విద్యార్థులకు హాల్‌టికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి గ్రామానికి, తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వనజకుమారి, శ్రీనివాస్, రోజారాణి, భాస్కర్, వెంకటేశం, పరుశురామమ్, శ్రావణి, బురాన్, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఆశయ సాధనకు కృషి



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం కార్యకర్తలు

యాచారం, మార్చి 16 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలని ఆర్య వైష్య సంఘం యాచారం నాయకులు సంతోష్, లక్ష్మణ్ కోరారు. శనివారం పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శివశంకర్, నవీన్, సురేందర్ తదితరులున్నారు.

కట్టా కుటుంబం ఆధీనంలోకి సత్యనారాయణ ఆలయం



పత్రాలను స్వాధీనం చేసుకుంటున్న పద్మ

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 16 : షాద్‌నగర్ పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయాన్ని శనివారం తిరిగి కట్టా నర్సింహులు కుటుంబం స్వాధీన పర్చుకున్నది. సత్యనారాయణ స్వామి భక్తుడైన కట్టా నర్సింహులు పరిగి రోడ్డులోని తన సొంత స్థలంలో శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయాన్ని నిర్మించి 19 జూన్ 2003లో చిన్న జీయర్‌స్వామిచే ప్రారంభింపజేశారు. కట్టా నర్సింహులు ఆధ్వర్యంలోనే నిత్యపూజులు, ప్రతి పౌర్ణమికి సామూహిక వత్రాలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చారు. భక్తుల సంఖ్య పెరగడం, కట్టా నర్సింహులుకు వయస్సు పైబడడంతో ఆలయ నిర్వహణను 2021 జనవరి 26 ఇస్కాన్ సంస్థకు అప్పగించారు. కాగా శనివారం ఆలయాన్ని తిరిగి ఇస్కాన్ సంస్థ ప్రతినిధి శంబు వైష్ణవ ప్రభు, కట్టా నర్సింహులు సతీమణి కట్టా పద్మకు అప్పగించారు. ఇక నుంచి నిత్యపూజలు నిర్వహిస్తూ ఆలయానికి పూర్వవైభవం తీసుకువరావడానికి కృషి చేస్తామని కట్టా ప్రవీణ్